

ఈనాడు

పార్వతీపురం మన్యం

సోమవారం ఆగస్టు 31, 2026

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నేడు

పార్వతీపురం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పాల్గొని తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చన్నారు. సంతృప్తికరమైన పరిష్కారం పొందినది.. లేనిది క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలియజేయవచ్చన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జేసీ, సబ్ కలెక్టర్ల నేతృత్వంలో 'రెవెన్యూ క్లినిక్' జరుగుతుందని పేర్కొన్నారు.



నీటి జాడేది.. నది నేడేది?



వంతరాం వద్ద ఇసుక మేటలు, గడ్డిదుబ్బులతో వేగావతి

వర్షాకాలంలో నీటితో కళకళలాడాల్సిన వేగావతి నది ప్రస్తుతం కళావిహీనంగా మారింది. ఇసుక మేటలు, గడ్డి దుబ్బులతోపాటు ఎక్కడికక్కడ గోతులతో కనిపిస్తోంది. బలిజిపేట మండలంలో ఓవైపు చిన్న పాయలుగా మాత్రమే నీరు ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఈ నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మరోపక్క సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కొండాపురం గ్రామస్థుల తాగునీటికి నది నీరే దిక్కు. పూర్తిగా ఎండిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ సోలార్ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ సమస్యను నీటి సరఫరా విభాగం జేఈ పవన్ కుమార్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

ప్రశాంతంగా నీట్ పీజీ

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం నీట్ పీజీ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గాజులరేగ అయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 475 మందికి 464 మంది హాజరయ్యారు. అభ్యర్థులను తనిఖీ చేసి.. లోపలికి అనుమతించారు. కేంద్రం వద్ద ఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలుచేశారు. అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా, రవాణా ఇతరత్రా ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

అన్నదాతలారా.. త్వరపడండి

నేటితో పంటల బీమా గడువు పూర్తి

పార్వతీపురం, భామిని, న్యూస్‌టుడే: జిల్లాలో వరి పండించే రైతులు పంటల బీమా చేయించుకునేందుకు సోమవారంతో గడువు ముగియనుంది. ఆగస్టు 31తో బీమా చెల్లింపులు నిలిచిపోనున్నాయి. ప్రస్తుతం వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో బీమా చేయడం వల్ల కొంతలో కొంతైనా ఆర్థిక లబ్ధి కలుగుతుందని వ్యవసాయాధికారులు రైతులను చైతన్యపరుస్తున్నారు. ఆదివారం జిల్లా వ్యవసాయాధికారి భవానీశంకర్ నేతృత్వంలో భామినిలో అవగాహన కల్పించారు. గడువు ముగుస్తున్న నేపథ్యంలో త్వరపడాలని సూచించారు.



భామినిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

లక్ష్యం చేరుకునే ప్రయత్నం

జిల్లాలో 29,074 హెక్టార్లలో పంటల బీమా నమోదు చేయాలని లక్ష్యం నిర్ణయించారు. మన్యంలో వరి, మొక్కజొన్న, పత్తి, అరటి పంటలకు అమలవుతుంది.

★ ఇప్పటివరకు 17 వేల మంది రైతులు 9,440 హెక్టార్లకు మాత్రమే పంట బీమా చేసుకున్నారు.

★ అయితే పొరుగు జిల్లాలతో పోల్చితే బీమా ప్రీమియం మొత్తం ఎక్కువ చెల్లించాల్సి ఉండడంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు.

★ గత ఏడాది 5,610 హెక్టార్ల పంటకు మాత్రమే బీమా చేశారు.

వినియోగించుకుంటే మేలు: ప్రస్తుత పరిస్థితుల్లో పంట బీమా చేయించుకోవడం ఎంతో మంచిది. వరికి ఎకరానికి రూ.40 వేలు, మొక్కజొన్న-రూ.33 వేలు, పత్తి-రూ.39 వేలు, అరటికి రూ.60 వేల వరకు పంట నష్టం కింద బీమా మొత్తం చెల్లిస్తారు. జిల్లాలో కొన్నిచోట్ల మొక్కజొన్న రైతులు బీమా చెల్లింపులో వెనుకబడి ఉన్నారు. వారిని లక్ష్యంగా చేసుకొని చైతన్యం కలిగిస్తున్నాం. ఆగస్టు 31తో బీమా చెల్లింపు గడువు ముగుస్తుంది. అందరూ వినియోగించుకుంటే మేలు జరుగుతుంది.

- భవానీశంకర్, జిల్లా వ్యవసాయాధికారి





రూ.15 కోట్లతో పాలకొండ అభివృద్ధి

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పట్టణ ప్రాంతాల్లో పర్యటనల సందర్భంగా గుర్తించిన ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పాలకొండలో 20 వార్డుల పరిధిలో సౌకర్యాల కల్పనకు రూ.15 కోట్లతో పనులు చేయనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రస్థాయి బృందం సర్వే చేపట్టింది. ఇప్పటికే లైటింగ్, కాలువల నిర్వహణకు రూ.5 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తామని పుర కమిషనర్ నూక రాజు తెలిపారు.











గచ్చులు ఊడుతున్నాయ్.. పిల్లర్లు ఊగుతున్నాయ్


ఊడిపోతున్న గచ్చులు


కూలేలా తరగతి భవనం

గంట్యాడ మండలం వసంత జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ పాఠశాలలో గతంలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు చాలావరకు శిథిలావస్థకు చేరాయి. విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. కూలేలా ప్రమాదకరంగా ఉంది. మరమ్మతులు చేపట్టినా.. ఫలితం లేదు. గచ్చులు ఊడిపోతున్నాయి. ఎక్కడ బోల్తాపడతామోనని విద్యార్థులు భయపడుతున్నారు. వీడియో పాఠాలు బోధించేందుకు ఏర్పాటుచేసిన ప్రొజెక్టర్, ఏసీ మరమ్మతులకు గురై మూలకుచేరాయి. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా.. ఫలితం లేదని చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు వాపోతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింహాచలంను వివరణకోరగా.. ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. – న్యూస్‌టుడే, పెదమజ్జిపాలెం (గంట్యాడ గ్రామీణం)

మట్టిదారిలో కష్టాల ప్రయాణం



విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో నేటికీ పలుచోట్ల మట్టిదారులే దర్శనమిస్తున్నాయి. శివారు ప్రాంతాలు, విలీన పంచాయతీల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వైకాపా హయాంలో సరిగా పట్టించుకోలేదు. కామాక్షినగర్- ఆనంద్‌నగర్ దారిలో మట్టిరోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే రాకపోకలు సాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కమిషనరు బాలస్వామి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ప్రీమియం రూ.27.. పరిహారం రూ.6 వేలు

జీవాలకు బీమా.. పోషకులకు ధీమా

న్యూస్‌టుడే– గరివిడి

గొర్రెలు, మేకల పెంపకంతో జీవనాధారం పొందుతున్న కుటుంబాలు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నాయి. వ్యవసాయానికి అనుబంధంగా వీటిని పెంచుకునే రైతులు అనేక మంది ఉన్నారు. ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో జీవాలు చనిపోతే పెంపకందారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీని నుంచి ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా సదుపాయం కల్పించాయి. పోషకులంతా ఈ పథకాన్ని వినియోగించుకుని బీమా పొందాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

రూ.9 లక్షల బడ్జెట్ కేటాయింపు

కుక్కల దాడులు, రోగాలు, ఇతరత్రా ప్రమాదాల బారినపడి గొర్రెలు, మేకలు మృతి చెందినప్పుడు పెంపకందారులు నష్టపోతుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకునేలా జీవాలకు బీమా పథకం కోసం 2026- 27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకు రూ.9 లక్షలు బడ్జెట్‌ను కేటాయించాయి. ఒక జీవానికి (గొర్రె లేదా మేక) మొత్తం ప్రీమియం రూ.180 కాగా.. అందులో ప్రభుత్వం రూ.153 భరిస్తుంది. పెంపకందారు కేవలం రూ.27 చెల్లిస్తే సరిపోతుంది. జిల్లాకు ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్ ప్రకారం మొత్తం 5,882 జీవులకు బీమా చేసేందుకు అవకాశముంది. ఈ మేరకు మండలాల వారీగా లక్ష్యాలను నిర్ధారించినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. బీమా చేసిన మేక లేదా గొర్రె ఏ కారణంతో మృతిచెందినా రూ.6 వేలు వరకు బీమా పరిహారం పొందవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం..

ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్ మేరకు మండలాల వారీగా ఎన్ని జీవాలకు బీమా చేయించాలన్నది పశువైద్యాధికారులకు ఇప్పటికే తెలియజేశాం. పెంపకందారులకు బీమా అవసరం, ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. పోషకులు స్వర్ణ గ్రామ కార్యాలయాల్లోని వెటర్నరీ సహాయకులు లేదా మండల పశువైద్యాధికారులను సంప్రదించాలి. ఇందుకు గడువు ప్రత్యేకంగా లేదు. కానీ త్వరగా ప్రీమియం వాటాను చెల్లించాలి.

– శివ్వాల మన్మథరావు, జేడీ, పశుసంవర్ధక శాఖ, విజయనగరం

జిల్లాలోని వివరాలు..
- ★ గొర్రెలు : 4,87,232
- ★ మేకలు : 1,70,613

కలల కొలువు.. సాధించిన గురువు

- ★ డిగ్రీ అధ్యాపకుడిగా మన్యం జిల్లావాసి
- ★ ఇటీవల మెగా డీఎస్సీలోనూ మూడు ఉద్యోగాలకు ఎంపిక



విజయనగరం విద్యావిభాగం, బలిజిపేట, న్యూస్‌టుడే: డిగ్రీ అధ్యాపక ఉద్యోగ పరీక్షలో తెలుగు ఉపాధ్యాయుడు **సారిపల్లి నాగరాజు** సత్తాచాటారు. అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇతనిది పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామం. ప్రస్తుతం నెల్లిమర్ల మండలం పారసాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తెలుగు సహాయకుడిగా పనిచేస్తున్నారు. 2023లో వెలువడిన ప్రకటన ద్వారా డిగ్రీ అధ్యాపక పోస్టులకు పోటీపడి ఉద్యోగాన్ని సాధించారు. ఇటీవల మెగా డీఎస్సీలో పాఠశాల సహాయకుడు, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు కైవసం చేసుకున్నారు. పెదపెంకి గ్రామంలో 1 నుంచి 10వ తరగతి వరకు.. ఇంటర్, డిగ్రీ ప్రకాశం జిల్లా తిమ్మసముద్రంలో చదివారు. రాజమహేంద్రవరంలో తెలుగు పండిట్ శిక్షణ పొందారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంలో 'చింతా అప్పలనాయుడు కథలు, పరిశీలన'పై ఎంఫిల్, 'అర్ధశతాబ్ది ఉత్తరాంధ్ర గిరిజన కథలు, పరిశీలన'పై పీహెచ్‌డీ చేశారు.

రచయితగా పేరు..

రచయితగా నాగరాజుకు పేరుంది. సుమారు 50 వ్యాసాలు, మూడు కథలు రాశారు. కొవిడ్ సమయంలో వేదికగా మారిన ఫేస్‌బుక్‌పై.. ఉత్తరాంధ్రకు చెందిన పలువురు రచయితలు, కథకుల మీద వ్యాసాలు రాశారు. అరసంలో ప్రస్తుతం విజయనగరం జిల్లా సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో మన్యం జిల్లా శాఖలోనూ బాధ్యతలు నిర్వహించారు. ఎంపికపై అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.ఎస్.చలం, రత్నాల బాలకృష్ణ, ఇతర సాహితీ సంస్థల సభ్యులు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛతలో మేటి.. పంచాయతీలకు పోటీ

స్వచ్ఛాంధ్ర-2026 పురస్కారాలు

న్యూస్‌టుడే– రాజాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి కావడంతో పల్లెల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నారు. గతంలో ఉపాధిహామీ పథకం కింద రహదారులు, కాలువలకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం స్వచ్ఛతలో మేటిగా ఉండే పంచాయతీలకు పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో 'స్వచ్ఛాంధ్ర అవార్డులు- 2026' పేరుతో పోటీ నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లాలో 777.. పార్వతీపురం మన్యం జిల్లాలో 451 పంచాయతీల్లో ఇది కొనసాగుతుంది. ఈ మేరకు ఆదేశాలు అందాయి. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా పురస్కారాలను అందిస్తారు.


రాజాం: పాగిరిలో స్వచ్ఛ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

స్వచ్ఛ గ్రామ పంచాయతీకి ప్రామాణికం ఇవీ..

అంశం	మార్కులు
ఇంటింట చెత్తసేకరణ	30
తడి, పొడి చెత్తసేకరణ	25
ఘన వ్యర్థాల నిర్వహణ	20
పరిసరాల పరిశుభ్రత	15
గృహ కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్	10

వంద మార్కులకు..

రాష్ట్ర, జిల్లాస్థాయిలో కలిపి 11 పురస్కారాలు అందించనున్నారు. జిల్లాస్థాయిలో అయిదు, రాష్ట్రస్థాయిలో ఆరు ఇవ్వాలని నిర్ణయించారు. స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో వీటిని అందిస్తారు. వంద మార్కులకు పోటీ ఉంటుంది. ఇందులో ఎక్కువ మార్కులు సాధించిన పంచాయతీకి అవార్డు దక్కుతుంది. పారిశుద్ధ్య కార్మికులకు కూడా పురస్కారాలు ఇవ్వనున్నారు. వీరికి జిల్లాస్థాయిలో అయిదు, రాష్ట్రస్థాయిలో మూడు ఇస్తారు. వీరికి వంద మార్కులకు పోటీ ఉంటుంది. వ్యర్థాల విభజన, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఇంటింటా చెత్త సేకరణ, విధుల పట్ల ఉన్న శ్రద్ధ, నిర్వహణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

క్షేత్రస్థాయిలో మెరుగా ఉంటేనే.. పురస్కారాల కోసం తిమ్మిని బమ్మిని చేస్తామంటే కుదరదు. క్షేత్రస్థాయిలో అన్నీ బాగుంటేనే అవార్డుకు ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో పంచాయతీ కార్యదర్శులు వివరాలను ఈనెల 31లోగా నింపి పంపాలి. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 8 వరకు జిల్లాస్థాయి బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వాస్తవ పరిస్థితిని తెలుసుకుంటాయి. వాటికి అనుగుణంగా ఫలితాలను ప్రకటిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి..

పలు విభాగాల్లో పురస్కారాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వీయ నమోదుకు అవకాశం కల్పించింది. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ పురస్కారాలను గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు రెండో తేదీన రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రదానం చేస్తారు.

– డీవీ మల్లికార్జునరావు, డీపీవో

విద్యుదాఘాతంతో చోదకుడికి తీవ్ర గాయాలు

బలిజిపేట, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు విద్యుత్తు తీగలు తగిలి డ్రైవరు తీవ్ర గాయాలపాలైన ఘటన బలిజిపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. అరసాడ గ్రామానికి చెందిన గుల్ల రాజు కుమార్తె వివాహానికి ఓ ప్రైవేటు బస్సును ఏర్పాటు చేసుకున్నారు. ఈ బస్సు గ్రామానికి వస్తుండగా బస్టాండు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో పైనున్న విద్యుత్తు తీగలు తగిలాయి. గుర్తించిన క్లీనరు ముందే కిందకు గెంతేశాడు. గరుగుబిల్లికి చెందిన చోదకుడు జి.సురేష్ విద్యుత్తు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు. బస్సులో వీరిద్దరు మినహా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

శాస్త్రోక్తంగా కుంకుమ పూజలు



కొత్తవలస, న్యూస్‌టుడే: వీరభద్రపురంలోని సర్వమంగళ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు కావలి రవికుమార్‌శర్మ శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. రాష్ట్ర దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పి.వి.రత్నాజీ పాల్గొన్నారు.

జీపీఎస్ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం దబర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(జీపీఎస్) ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు) గిరీష్‌ను సస్పెండ్ చేసినట్లు ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్థులు పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీడీ అన్నాదొరకు ఆదేశించామన్నారు. డిప్యూటీ డీఈవో పి.నారాయుడు ఆధ్వర్యంలో విచారణ జరిగిన తర్వాత క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఉపాధ్యాయుడ్ని సస్పెండ్ చేశామన్నారు. విధులకు గైర్హాజరైనా, బాధ్యతగా విధులు చేపట్టకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని పీవో హెచ్చరించారు.

ఏడుగురు యువకులను రక్షించిన లైఫ్‌గార్డులు

తప్పిన పెను ప్రమాదం


కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

విశాఖపట్నం(సాగర్‌నగర్), న్యూస్‌టుడే: విశాఖపట్నం రుషికొండ తీరంలో ఆదివారం సముద్ర స్నానాలకని దిగిన ఏడుగురు యువకులు కొట్టుకుపోతుండగా జీవీఎంసీ, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్ లైఫ్‌గార్డులు వారిని రక్షించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ (రాయపుర్)కు చెందిన రాజేంద్రసత్య, మనోజ్‌తండిల్‌వాల్, కిశోర్‌కుమార్‌ఠాకుర్, తరుణ్‌వర్మ, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన టి.మురళీ, జి.శ్రీరామ్‌కుమార్, ఆర్.తేజేశ్వరరావు విహారయాత్రలో భాగంగా రుషికొండ తీరానికి వచ్చారు. ఈ క్రమంలో స్నానాల కోసం సముద్రంలో దిగారు. అలల ఉద్ధృతి అధికంగా ఉండటంతో కొట్టుకుపోతున్న వీరిని లైఫ్‌గార్డులు గుర్తించి మెరైన్ పోలీసుల సహకారంతో సకాలంలో ఒడ్డుకు చేర్చారు. ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మెరైన్ సీఐ అప్పారావు, ఎస్సై మనోజ్‌కుమార్ సూచనల మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు సమక్షంలో యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు.

★ సందర్శకులు సముద్ర స్నానాలు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ (ఆర్ఎల్ఎస్ఎస్), వాటర్‌స్పోర్ట్స్ అధ్యక్షుడు బి.బలరామ్ నాయుడు పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న లైఫ్‌గార్డుల సేవలను కొనియాడారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని జూనియర్ లైన్‌మెన్ మృతి


చుక్క సంతోష్ (పాతచిత్రం)

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కొత్త రోడ్డు సమీపంలో ఆదివారం ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చుక్క సంతోష్ (36) హడ్కో కాలనీలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొత్తరోడ్డు వైపు నుంచి శ్రీకాకుళం బస్టాండ్‌కు బస్సు వస్తుండగా, అదే సమయంలో సంతోష్ రోడ్డు దాటుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చిన్ని గ్రామం. గత ఆరేళ్లుగా శ్రీకాకుళంలోనే కుటుంబంతో నివాసముంటున్నాడు. భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీకాకుళం గ్రామీణ ఎస్సై కె.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సర్వజనా సుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి దుర్మరణం

కావలి, న్యూస్‌టుడే: రైలు ఎక్కబోతూ అదుపు తప్పి పట్టాలపై పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పి.ఈశ్వరరాజు (70) అనే వృద్ధుడు పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఓ యజమాని వద్ద పనిచేస్తున్నాడు. ఆ యజమానికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలంలో పొలాలు ఉన్నాయి. అక్కడ ఈశ్వరరాజు సహాయకుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో భీమవరానికి వెళ్లేందుకు ధర్మవరం- నరసాపురం ఎక్స్‌ప్రెస్ రైలుకు రిజర్వేషన్ చేయించుకున్నాడు. స్టేషన్‌కు ఆయన ఆలస్యంగా చేరుకోవడంతో కదులుతున్న రైలును ఎక్కే ప్రయత్నం చేయగా అదుపుతప్పి పట్టాలపై పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై చెప్పారు.

పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

కొత్తవలస, జామి, న్యూస్‌టుడే: కంటకాపల్లి- అలమండ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించామని విజయనగరం రైల్వే పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని.. తల, నడుముకు ఎడమ వైపు బలమైన గాయాలు ఉన్నాయన్నారు. సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని.. ఎరుపు రంగు కట్ బనియన్ వేసుకొని, నడుముకు తెలుపు, నీలం, నలుపు గడులున్న షర్ట్ చుట్టుకొని ఉన్నాడని పేర్కొన్నారు. కేసు నమోదుచేసి, మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి శవాగారానికి తరలించామని చెప్పారు. ఇతని ఆచూకీ తెలిసినవారు 92475 85742, 94401 70317 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కోటిపాంలో కరిరాజులు



కొమరాడ, న్యూస్‌టుడే: కొమరాడ మండలం కోటిపాం పరిసర ప్రాంతాల్లో కరిరాజులు సంచరిస్తున్నాయి. వరి దుబ్బుకడుతున్న సమయంలో అడవి ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు లేక పంటలు పండడంలేదని.. దీనికితోడు గజరాజులు పంటలను నాశనం చేస్తున్నాయని రైతన్నలు విలపిస్తున్నారు. వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్‌ఎస్.. సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు పీజీఆర్‌ఎస్ నిర్వహించనున్నట్లు కార్యాలయం సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందించవచ్చన్నారు.

మన్యం మెరికలు.. క్రీడల్లో మెరిశారు


కస్తూరి | దివ్య అవని | ప్రశాంతి | సుశీల | హరీష్

పార్వతీపురం పట్టణం, బృందం, న్యూస్‌టుడే: సరైన మైదానాలు లేవు. సాధన చేసేందుకు అరకొర సౌకర్యాలు. అయినా సాధించాలన్న పట్టుదలకు ఇవేమీ అడ్డంకి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో మన్యం క్రీడా మెరికలు సత్తాచాటారు. వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచారు. అథ్లెటిక్స్ పోటీల్లోనూ పతకాలు కైవసం చేసుకొని ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా విజేతలను డీఎస్‌డీవో శ్రీధరరావు, స్పోర్ట్స్ సమన్వయకర్త, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వాసుదేవరావు నాయుడు, చంద్రమోహన్ తదితరులు అభినందించారు.

విజేతలు వీరే..

కరంజమ్మగూడకు చెందిన ఎస్.కస్తూరి.. 100 మీటర్ల (4x100) రిలేలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు, మెంటాడ మండలం గుర్ల తమ్మిరాజుపేటకు చెందిన దివ్య అవని.. 100 మీటర్ల పరుగులో వెండి, రిలేలో బంగారు పతకాలు పొందారు. గుమ్మలక్ష్మీపురంలో చదువుతున్న సీహెచ్ ప్రశాంతి, 100 మీటర్ల రిలేలో బంగారు, సౌత్‌జోన్ స్టేట్ మీట్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం పొందారు. బొడ్డగూడకు చెందిన బి.సుశీల 100 మీటర్ల రిలేలో బంగారు, పాచిపెంటకు చెందిన ఎం.హరీష్ 800 మీటర్ల, 5కేఎం పరుగులో బంగారు పతకాలతో సత్తా చాటారు. హరీష్ త్వరలో పాండిచ్చేరిలో జరగనున్న మీట్‌కు వెళ్లనున్నాడు.

అడ్డుగోడ తొలగింది

పుర షాపింగ్ కాంప్లెక్స్‌కు మోక్షం


అడ్డుగోడ తొలగించిన తర్వాత ఇలా..

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వసతుల్లేవనే కారణంతో పక్కనే ఉన్న మున్సిపాల్టీకి చెందిన స్థలంలో కొత్తగా మరో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించారు. అప్పట్లో వైకాపా మంత్రులు దీన్ని ప్రారంభించారు. వసతులు దేవుడెరుగు.. కనీసం పూర్వ కాంప్లెక్స్‌లోకి జనం రాకుండా మధ్యలో భారీగోడ నిర్మించారు. అప్పట్లో ఇన్, అవుట్‌గా ఉన్న గేట్లను కాదని.. ఒకే గేటుకు పరిమితం చేశారు. దీంతో అంత వరకు ఒక వెలుగు వెలిగిన పురపాలిక వాణిజ్య సముదాయాలు జనం లేక వెలవెలబోవడం మొదలయ్యాయి. ఒక్కో దుకాణాన్ని వ్యాపారులు ఖాళీ చేసి పురపాలికకు తాళాలు అప్పగించేశారు. దీంతో ఏటా రూ.30 లక్షల వరకు ఆదాయానికి గండి పడుతూ వచ్చింది. దీనికితోడు కాంప్లెక్స్ మొత్తం దుర్గంధంగా మారింది. ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిపోయింది. వైకాపా హయాంలో చేసిన తప్పిదాన్ని ఎట్టకేలకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సరిచేయించారు. ఏళ్లుగా నలుగుతున్న సమస్యను కొలిక్కి తెచ్చారు. ఈనెల 28న చొరవ తీసుకుని గోడను తొలగింపజేశారు.

స్థానికుల్లో హర్షం.. పాత కాంప్లెక్స్ ప్రాంగణంలోనే నవదుర్గ, జ్ఞాన సరస్వతి అమ్మవార్ల ఆలయాలు ఉన్నాయి. చాలామంది అమ్మవార్లను దర్శించుకుని బస్సులో ప్రయాణించేవారు. గోడ కట్టడం వల్ల ఆలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది. గోడను తొలగించాలని ప్రజలు అనేకసార్లు వినతులు ఇచ్చారు. స్వయంగా ఎమ్మెల్యే కూడా ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరారు. ఎట్టకేలకు తొలగింపజేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై విలువైన పురపాలిక కాంప్లెక్స్‌లు వినియోగంలోకి వస్తాయని ఆశిస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన సీనియర్ జట్టు

బొబ్బిలి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్లను బొబ్బిలి సమీప పారాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపిక చేశారు. సాఫ్ట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బేబినాయన సూచనలతో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ స్థాయిలో ఎంపిక పోటీలు జరిపారు. ఎల్.కోట, భోగాపురం, ఆరికతోట, తోటపల్లి, బొడ్డవర, పెరుమాళి, బాడంగి, రామభద్రపురంతో పాటు పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలు బొబ్బిలిలో, జూనియర్స్, సీనియర్స్ పోటీలు కడపలో అక్టోబరులో నిర్వహించనున్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరమేష్, కార్యదర్శి విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, పీడీలు సత్యనారాయణ, వెంకటనాయుడు, శివ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీల చోరీ

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలం కొండగంగుబూడి పంచాయతీలో బంగారమ్మ, రామాలయంలోని హుండీలు వరుసగా చోరీకి గురయ్యాయి. దీంతో వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో స్థానికులు ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 8 గంటల వరకు స్థానికులు రామాలయంలో భజనలు చేసి.. ఇళ్లకు వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి హుండీ తాళం విరగ్గొట్టి ఉంది. కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బంగారమ్మ ఆలయంలో ఈనెల 27న గేటు తాళాలు విరగ్గొట్టి హుండీ పగులగొట్టి కాజేశారు. దీంతో స్థానికులు ఈ రెండు ఘటనలపై ఫిర్యాదు చేశారు. ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసి.. విజయనగరం నుంచి క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు చేపట్టారు.

పెద్దగెడ్డలో తగ్గిన నీటిమట్టం



ఉమ్మడి విజయనగరం జిల్లాలో 12 వేల ఎకరాలకు సాగునీరందించే పాచిపెంట పెద్దగెడ్డ జలాశయంతో ఈ ఏడాది ఆయకట్టుకు సాగునీరు అందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుతో పాచిపెంట, సాలూరు, విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం శివారు ఆయకట్టుకు సాగునీరు అందించటం లక్ష్యం. ఎల్‌నినో ప్రభావంతో జలాయంలో పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. రోజురోజుకు నీటిమట్టం తగ్గుతుండటంతో జలాశయం మట్టిగట్టుకు ఆనుకుని ఉన్న రాతికట్టు కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మధ్యలో ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. వర్షాలు వస్తేనే ఆయకట్టుకు నీరు ఇవ్వగలుగుతామని, రైతులు ఆరు తడిపంటలు వేసుకోవాలని డీఈ శ్రీనివాసరావు సూచించారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట

పనులు చేయక.. దుర్వాసన వీడక



పార్వతీపురం పట్టణంలోని 9వ వార్డు నిర్మల కాలనీలో కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలు పేరుకుపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయింది. కాలువలు శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పారిశుద్ధ్య అధికారి కె.పకీరురాజు వద్ద ప్రస్తావించగా చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలక

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు?



బలిజిపేట మండలంలోని తుమరాడలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ కింద రూ.66 లక్షలతో ఏడాది క్రితం పనులు చేపట్టారు. దీనిలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వి ప్లాస్టిక్ పైపులు వేశారు. పనులను మధ్యలోనే వదిలేశారు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను నీటి సరఫరా విభాగం జేఈ పవన్‌కుమార్ వద్ద ప్రస్తావించగా త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

హామీలు గాలికి.. కష్టాలు వీరికి

న్యూస్‌టుడే, సాలూరు

ఎప్పుడు కూలిపోతుందో తెలీదు.. నీటి సరఫరా ఎప్పుడు ఆగిపోతుందో తెలీదు.. వీటిని గొప్పగా మారుస్తామని గొప్పగా హామీలు ఇచ్చారు. కానీ చూస్తే మాత్రం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇదీ పట్టణంలోని ప్రధాన నీటి సరఫరా కేంద్రం భవనం పరిస్థితి. ఇక్కడి నుంచి 50 వేల మందికి నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. గత ప్రభుత్వ హయాంలో అమృత్ పథకంలో భాగంగా రూ.69 కోట్లతో కొత్త నీటి పథకం మంజూరైంది. అప్పటి పాలకులు శిలాఫలకం కూడా వేశారు. కానీ పని పూర్తిచేసిన పాపానికి పోలేదు. ఇది పూర్తవుతుందని ఉన్న దానిని విస్మరించారు. నీటి సరఫరాలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండే సాలూరు.. ప్రస్తుతం తాగునీటి సమస్యతో సతమతమవుతోంది.

ఎప్పుడు కూలుతుందో..

ప్రధాన నీటి సరఫరా కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చినుకుపడితే కారిపోతోంది. ప్యానెల్ బోర్డులు పాడై విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. విధులు నిర్వహించేందుకు సిబ్బంది కేంద్రంలో అడుగుపెట్టడానికే భయపడుతున్నారు. కిటికీలు, తలుపులు పాడైపోయాయి. రాత్రి సమయాల్లో విషసర్పాలు లోపలకు చొరబడుతున్నాయి. బావుల నుంచి నీటిని పంపింగ్ చేసే మోటార్లు సక్రమంగా పని చేయడం లేదు. ప్రస్తుతం ఒకే మోటారుతో పంపింగ్ జరుగుతోంది. అది మరమ్మతులకు గురైతే ఆరోజు నీటి సరఫరా నిలిచిపోవాల్సిందే. పంపులు తుప్పు పట్టాయి. నీటి సరఫరా కేంద్రం మరమ్మతులు, మోటార్ల కొనుగోలుకు 2018లో తెదేపా హయాంలో రూ.30 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. వైకాపా వచ్చాక ఆ పనులను రద్దు చేసింది.



శిథిలావస్థకు చేరిన నీటి సరఫరా కేంద్రం

రూ.100 కోట్లతో అంచనాలు..

కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ రూ.100 కోట్లతో కొత్త అంచనాలు వేశారు. పనులకు మంత్రి సంధ్యారాణి భూమిపూజ కూడా చేశారు. ఇది పూర్తవడానికి రెండు నుంచి మూడేళ్లు పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్యాంకులు, పైపులైన్ల పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని పుర డీఈ ప్రసాద్ తెలిపారు.



తుప్పుపట్టిన పంపులు

గర్భం దాల్చిన విద్యార్థిని

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని(16) గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే...విద్యార్థిని వేసవి సెలవుల తర్వాత కళాశాలకు వచ్చినప్పటి నుంచి సాధారణంగానే ఉంది. కొన్ని రోజుల నుంచి కదలికల్లో మార్పులు, రక్తహీనత వంటి లక్షణాలను గుర్తించిన సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భిణి అని తేలింది. కుటుంబసభ్యులకు విషయం చెప్పగా బాలికను తీసుకెళ్లినట్లు సమాచారం. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎల్విన్‌పేట ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలంలోని పాచిపెంట నుంచి పి.కోనవలస చెక్‌పోస్టు కూడలి వరకు ఉన్న ప్రధాన రోడ్డులో మలుపుల వద్ద పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడంలేదు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎస్సై అర్జున్ పనికిరాని మొక్కలను సిబ్బందితో తొలగించారు.



ఉత్తమ సేవలతో గుర్తింపు



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కడ్రక ప్రకాశరావును ఆదివారం సత్కరించారు. ఎస్టీ కమిషన్, ట్రైకార్ డైరెక్టర్లు మల్లేశ్వరరావు, లావణ్య, ఏఎంసీ ఛైర్మన్ కళావతి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి పద్మావతి, ఎస్టీ సెల్ కన్వీనర్ భూషణరావు, మండల కన్వీనర్ నరేష్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వాట్సప్ జట్టు... సమస్యలు తీరేట్టు

పాలకొండ నగరపంచాయతీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ చర్యలు చేపట్టారు. 20 వార్డుల వాసులతో వాట్సప్ గ్రూపును ఏర్పాటుచేశారు. ఇందులో 187 మంది వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలను భాగస్వాములను చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు. ఆరు నెలల్లో ఈ గ్రూపు ద్వారా 480 వరకు సమస్యలు పరిష్కారమయ్యాయని పుర కమిషనర్ పీవీ నూకరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ



సమస్యల పరిష్కారానికి కృషి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలని జిల్లా అన్ ఎయిడెడ్ పాఠశాలల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శ్రీజన్ పాఠశాలలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు చర్చించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ సరళకుమారి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తగవు

పార్వతీపురం, న్యూస్‌టుడే: సాలూరు మండలం కురుకుట్టి ఆశ్రమ పాఠశాలలో చోటు చేసుకున్న పరిణామాలకు ప్రధానోపాధ్యాయుడిని బాధ్యుడిని చేయాలని అధికారులు భావించడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

130 మంది ఓటర్లుగా నమోదు

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో 130 మంది ఓటర్లుగా నమోదైనటు ఉప తహసీల్దారు వి.రంగారావు తెలిపారు.

స్నేహభావంతో మెలగాలి

పాచిపెంట, న్యూస్‌టుడే: యువత పోలీసులతో స్నేహభావంతో మెలగాలని సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని మంచాడవలసలో ఆదివారం రాత్రి మన్యంతో మమేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సై ఎల్.అర్జున్ ఉన్నారు.

దుర్గమ్మకి ప్రత్యేక పూజలు



పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రావణ ఆదివారం సందర్భంగా పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఘటోత్సవాలు నిర్వహించారు. షిర్డీసాయినగర్‌లో జ్ఞానసరస్వతి ఆలయంలో లలితాదేవికి కుంకుమార్చనలు, పుష్పార్చన చేశారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: వాహన చోదకులు రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాల నియంత్రణలో భాగస్వాములు కావాలని ట్రాఫిక్ ఎస్సై ఎం.పాపారావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పలు కూడళ్ల వద్ద రహదారి నిబంధనలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి వాహనం నడపాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? రావికోన పంచాయతీలో పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు ప్రహరీ లేదు. - **రామస్వామి, స్థానికుడు** ● పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **కృష్ణ, ఉపాధిహామీ ఏఈ** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? పెదభోగిల నీలాటి రేవుకు ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. - **అప్పలనాయుడు, స్థానికుడు** ● తొలగింపు పనులు చేపడతాం. - **సురేష్, ఈవో** – న్యూస్‌టుడే, సీతానగరం

? కత్తులకవిటిలో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. - **వెంకటరమణ, స్థానికుడు** ● పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, వీరఘట్టం

? వడమ కూడలి వీధిలో కాలువలు పూడికలతో నిండిపోయాయి. - **రమణ, వ్యాపారి** ● పరిశీలించి పనులు చేయిస్తాం. - **నూకరాజు, కమిషనర్** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? పెదగుడబలో సర్కారుబడి శిథిలావస్థకు చేరుకుంది. - **శంకరరావు, స్థానికుడు** ● చర్యలు తీసుకుంటాం. - **కొండలరావు, ఎంఈవో** – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

తాగునీటికి ఇక్కట్లు



పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండలో పలు ప్రాంతాలకు గత రెండు రోజులుగా రక్షిత మంచి నీటి సరఫరా నిలిచిపోయింది. స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణలో ఉన్న ట్యాంకుకు సంబంధించిన పైపు ఆర్టీసీ కాంప్లెక్సు సమీపాన లీకు ఏర్పడింది. దీంతో ఆంజనేయనగర్, వడమకూడలిలోని సత్యసాయినగర్, డిగ్రీ కళాశాల రహదారి, కాశీవిశ్వేశ్వరాలయం తదితర వీధుల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని నగర పంచాయతీ ఏఈ నరసింగరావు తెలిపారు.

స్పందనకు వందనం

పనికిరాని మొక్కల తొలగింపు

పాచిపెంట: పాచిపెంట హరిజన వీధిలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగి ప్రమాదకరంగా ఉండేది. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి మొక్కలను తొలగించారు. ● పాచిపెంట చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద చెత్త పేరుకుపోయింది. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమవగా.. పంచాయతీ కార్యదర్శి దీపక్‌కుమార్ స్పందించి పనికిరాని మొక్కల తొలగింపు పనులు చేపట్టారు.

కాలువల శుభ్రం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సూడిగాం పంచాయతీ మూడడ్లవలస అంగన్‌వాడీ కేంద్రం వద్ద కాలువలు అధ్వానంగా ఉండేవి. స్థానికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. ఎంపీడీవో జి.రమేష్ స్పందించి కాలువలోని వ్యర్థాలను సిబ్బందితో తొలగింపజేశారు.

బ్లాక్‌లో టికెట్.. చేతిలో స్కానర్



సాంకేతికత రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. డిజిటల్ చెల్లింపులు జోరుగా సాగుతున్నాయి. ఇన్ని జరుగుతుండగా మేమేం తక్కువ కాదు అని సినిమా టికెట్లు బ్లాక్‌లో విక్రయించేవారు సైతం డిజిటల్ చెల్లింపులకు తెరతీశారు. ఆదివారం పట్టణంలోని ఓ థియేటర్ వద్ద ఇలా కనిపించారు. డబ్బులు లేవా నాయనా.. అయితే స్కాన్ చేసి టికెట్ పట్టుకుపో అనడంతో ప్రేక్షకులు ఆశ్చర్యానికి గురయ్యారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం











ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

కురుపాం గ్రామీణం: పీఎం జన్‌మన్ కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు ప్రారంభించాలని జిల్లా ప్రత్యేక అధికారి, గృహనిర్మాణ శాఖ ఎస్ఈ జె.ఏవీ.ఎస్.ఆర్.కె. ప్రసాద్ అన్నారు. ఆదివారం కురుపాం మండలం నీలకంఠాపురం పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఇళ్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జి.అచ్చియమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



నిరసన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కలెక్టరేట్ ప్రాంగణం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి పూర్తిగా మినహాయింపునివ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నినాదాలు చేపట్టారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారావు, భాస్కరరావు పాల్గొన్నారు.



